క్లుప్తంగా

ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలి

కొడకండ్ల: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మోడపల్లి సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు వ్యయ భారం పెరిగినందున సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.10 వేల నష్టపరిహారం సరిపోదని, రైతు పక్షపాత ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొవడం కాదు, పంటల నష్ట పరిహారాన్ని రూ. 25 వేల చొప్పున అందించాలన్నారు. బీజేపీ కిసాన్ సెల్ అధ్యక్షుడు పనస రాములు తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ మల్లన్నగండి రిజర్వాయర్‌లో నీళ్లు సమృద్ధిగా ఉన్నా ఎడమకాల్వ కింద ఉన్న పలు గ్రామాలకు సాగునీరు అందక పంటపొలాలు ఎండిపోతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు నునావత్ సుమన్ నాయక్ అన్నారు. మండలంలోని జిట్టెగూడెం తండాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్నగండి ఎడమ కాల్వ కింద ఉన్న తాటికొండ, జిట్టెగూడెం, గార్లగడ్డ తండా ఫత్తేపూర్, కృష్ణాజీగూడెం గ్రామాల రైతుల పరిస్థితి తలాపున గోదావరి ఉన్నా పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి మల్లన్నగండి ఎడమకాల్వ ద్వారా రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సన్మానం



జనగామ రూరల్: జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగంను వడ్లకొండ కురుమ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యువజన సంఘం అధ్యక్షుడు మోటె రాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కురుమల పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఉపాధ్యక్షులు బోడ సత్తయ్య, కర్రె రమేష్, గౌరవ అధ్యక్షుడు గొరిగె రమేష్, సహాయ కార్యదర్శి కాసర్ల అశోక్, గొరిగె మహేష్, కార్యవర్గ సభ్యులు గుత్తి కుశాకర్, మోటె సత్యం, రాచకొండ ఎల్లేష్, కేమిడి రవి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ: కలెక్టరేట్ ఆవరణలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత పీఠాధిపతి ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో తయారు చేసిన త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ శనివారం ఆవిష్కరించారు. ప్రబోధసేవ సమితి జనగామ కమిటీ సభ్యుడు కొన్నె ఉపేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహం ఊరేగింపు

బచ్చన్నపేట: బచ్చన్నపేట శివారు ఎద్దుగూడెంలో నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాన్ని శనివారం గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు జరుగుతాయన్నారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలుకు మరోపోరాటం

దేవరుప్పుల: తెలంగాణ విభజన చట్టం అమలులో ఉమ్మడి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను మోదీ సర్కార్ అమలు చేసేందుకు మరోపోరాటం అనివార్యమని సీపీఐ మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని కడవెండిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్మారక స్తూపం వద్ద సీపీఐ ప్రజాపోరు యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మోత్కుపల్లి సుజిత్,బోనగిరి ప్రసాద్, దండంపెల్లి దాస్, ఐలయ్య, అశోక్, ఎల్లయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చిల్పూరు: సీసీ రోడ్డు నిర్మాణానికి వార్డు ప్రజలు సహకరించాలని ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు కోరారు. శనివారం మండల కేంద్రంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. ఇంటి యజమానులకు ఎవరికి ఇబ్బంది, నష్టం వాటిల్ల కుండా పనులు చేస్తామని.. అందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, బాలరాజు, ప్రవీణ్, రమేష్, స్వామి, లింగయ్య, కుమార్, రజనీకుమార్ ఉన్నారు.

పంచాయతీకి పురస్కారం

- జిల్లాకు 36.. రాష్ట్రానికి 27 అర్హత
- జాతీయ స్థాయికి రెండు జీపీలు!
- ఇటీవలే సెంట్రల్ టీం పర్యటన..

జనగామ: తెలంగాణ పల్లెలు ప్రగతి వెలుగులతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. వ్యక్తిగత మరుగుదొడ్లు, చెత్త సేకరణ, వైకుంఠధామాలు, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, ట్రాక్టర్లు, సీసీరోడ్లు.. డ్రెయినేజీల నిర్మాణం ఇలా ఊరికి అవసరమైన కనీస మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మారిపోతున్నాయి. జీపీల అభివృద్ధిలో మరింత పోటీ పెంచే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జాతీయ పంచాయతీ 2022–23 అవార్డులకు శ్రీకారం చుట్టాయి. ఇందుకు 9 థీమ్స్(కేటగిరీలు) నిర్ణయించి గత ఏడాది సెప్టెంబర్‌లో ఎంపిక ప్రక్రియ మొదలు కాగా.. మండల, జిల్లా స్థాయిలో అర్హత కార్యక్రమం ముగిసింది. ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో 281 జీపీలు ఉండగా.. 36 జీపీలు జిల్లా స్థాయి అవార్డుకు అర్హత సాధించగా.. వాటి నుంచి 27 జీపీలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. జిల్లా స్థాయికి ఎంపికైన జీపీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను శనివారం సత్కరించారు.

జాతీయ స్థాయికి రెండు జీపీలు..!

జిల్లాలోని బచ్చన్నపేట మండలం కొడవటూరు, లింగాలఘణపురం నెల్లుట్ల, రఘునాథపల్లి మండలం నిడిగొండ జీపీల్లో 20 రోజుల క్రితం కేంద్ర బృందాలు పర్యటించాయి. ఇందులో కొడవటూరు, నెల్లుట్ల జీపీలను జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిసినా.. అధికారికంగా వెలువడాల్సి ఉంది. ఈనెల 31న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో జాతీయ స్థాయి ఎంపికలను ప్రకటించనున్నారు.



జిల్లాస్థాయి అవార్డులు అందుకున్న సర్పంచ్‌లు

జాతీయ స్థాయికి ఎంపికైన జీపీలకు ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

మూడు కేటగిరీల్లో బహుమతులు..

జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికై న జీపీలకు మూడు కేటగిరీల్లో బహుమతులు అందించనున్నారు. మొదటి బహుమతి రూ.50లక్షలు, రెండో బహుమతి రూ.40లక్షలు, మూడో బహుమతి రూ.30 లక్షల ప్రైజ్ మనీ అందిస్తారు. ఇందులో తెలంగాణ నుంచి జనగామకు ప్రాతినిథ్యం దక్కుతుందని భావిస్తున్నారు.

ఇంటింటికీ తాగునీరు..



ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి గ్రామ పంచాయతీ సమావేశాల్లో పాల్గొన్నాను. దేశంలో అనేక గ్రామాలు తాగునీటి కోసం తండ్లాడుతున్నాయి. ఒక్క తెలంగాణలోనే ఇంటింటికీ తాగునీరు వస్తుందని ప్రతి ఒక్కరూ మాట్లాడారు.

– కేశిరెడ్డి ప్రత్యూషరెడ్డి, సర్పంచ్, శ్రీపతిపల్లి

గ్రామాల్లో స్వర్ణయుగం



జీపీలకు ఈసారి స్వర్ణయుగం వచ్చింది. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషితో నిధులు అందుబాటులోకి వచ్చాయి. నేడు తెలంగాణ సర్పంచ్‌లకు దేశంలో గుర్తింపు వచ్చింది.

– మధు, సర్పంచ్, కొడకండ్ల

మంత్రి, ఎమ్మెల్యే సహకారంతోనే..



మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 100 శాతం జిల్లా, రాష్ట్ర స్థాయి పంచాయతీ అవార్డుకు ఎంపికయ్యాము. జాతీయ స్థాయికి సంబంధించి ఇటీవలే సెంట్రల్ టీం గ్రామంలో పర్యటించింది. జాతీయ స్థాయి అవార్డుకు అర్హులమే.

– గంగం సతీష్‌రెడ్డి, సర్పంచ్, కొడవటూరు

దేశంలో మనమే నంబర్ వన్



పల్లెలు ప్రగతి సాధించడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం 20 స్వచ్ఛ అవార్డులు ప్రకటిస్తే ఇందులో 19 తెలంగాణకే రావడం మన కృషి, పట్టుదలకు నిదర్శనం. కేసీఆర్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి దేశంలోని రాష్ట్రాలకు తెలంగాణ మోడల్‌గా నిలుస్తున్నది. మహిళలకు గౌరవం మరింత పెరిగింది. పంచాయతీ అవార్డుల్లో సైతం మనకే అవకాశం ఉంది.

– ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర మంత్రి

ఉత్తమ పంచాయతీలుగా రఘునాథపల్లి, అబ్దుల్‌నాగారం





సర్పంచ్‌లు పోకల శివకుమార్, రమాసంపత్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

రఘునాథపల్లి/తరిగొప్పుల: జిల్లాస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన రఘునాథపల్లి, తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారం సర్పంచ్‌లు పోకల శివకుమార్, అర్జుల రమాసంపత్‌రెడ్డి.. మంత్రి, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్, కలెక్టర్ చేతులమీదుగా శనివారం పురస్కారం అందుకున్నారు.

అభివృద్ధికి సహకరిస్తాం..

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఎంపీటీసీ కుందూరు విజయలక్ష్మి, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాల వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆసీఫ్ బహుమతులు, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ విద్యార్థులకు టీషర్ట్‌లు పంపిణీ చేశారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

రఘునాథపల్లి: మహిళా సాధికారిత, ప్రభుత్వ పథకాల అమలులో రెండు దశాబ్దాలుగా కీలకంగా వ్యవహరిస్తోన్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కొయ్యడ మల్లేష్‌మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ముందు వివిధ పార్టీల నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేష్ మాదిగ మాట్లాడుతూ మహిళా సంఘాల స్థిరత్వం, సమాజాభివృద్ధి కోసం పని చేస్తున్న వీఓఏలపై ప్రభుత్వం వివక్షత చూపడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గంగామణికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. బొక్క రాంచంద్రయ్య, జేరిపోతుల సుధాకర్, కెతావత్ వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని నిరసన

తరిగొప్పుల: తాగునీటి సమస్యను తీర్చాలంటూ మండలకేంద్రంలోని 6వ వార్డు(గొల్లకుంట)కాలనీ మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వేసవి కాలం మొదలవుతున్న నేపథ్యంలో క్రమం తప్పకుండా ప్రతీ రోజు తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. బూస కొంరమ్మ, సుంకరి తారవ్వ, నేతుల రజని, గాలి మౌనిక, మెర్గొజు ఉత్తరమ్మ, కర్ణ కంటి పార్వతమ్మ, తాటికాయల మంజుల, చిలివేరు సావిత్రి, బూస సమ్మక్క, సుల్తాన్ స్నేహ, సాయబోయిన పద్మ, విజయ పాల్గొన్నారు.

మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలి



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

తరిగొప్పుల: పదో తరగతి పరీక్షల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించి మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలని తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్ అన్నారు. మండలకేంద్రానికి చెందిన ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు అర్జుల అరుణ్‌రెడ్డి సొంత డబ్బులతో సమకూర్చిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులను శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తహసీల్దార్ అందజేశారు. హెచ్‌ఎం రామచంద్రయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ జంగ వీరయ్య, శ్రీనివాస, అర్జున్, రంజిత్‌రెడ్డి, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైభవంగా వార కల్యాణం

చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామివారికి శనివారం అర్చకులు వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులు వేడుకను తిలకించి పులకించి పోయారు. కల్యాణ అనంతరం భక్తులకు హైదరాబాదుకు చెందిన ముత్తినేని వెంకటేశ్వర్లు, కనుకమహాలక్ష్మి, రమాదేవి దంపతులు అన్నప్రసాదం సమకూర్చారు. ఏర్పాట్లను చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఇన్‌చార్జి ఈఓ వెంకట్రావు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే రాజయ్యను కలిసిన ముదిరాజ్‌లు

జఫర్‌గఢ్: తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు సర్పంచ్ పొన్నాల జ్యోతి నాగరాజు ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి ముదిరాజ్ కమ్యూనిటీహాల్‌కు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, నాయకులు స్వామి, నరేష్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్‌లో యువకులకు సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి క్రికెట్ కిట్‌ను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు.

పరిహారం అందించాలి

జనగామ రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాంబరాజు యాదగిరి అన్నారు. శనివారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు.

రోడ్డు నిర్మాణానికి చేయూత

బచ్చన్నపేట: బండనాగారంలోని శ్రీ రామలింగేశ్వరాలయం ఎదుట సిద్దిపేట జిల్లా మద్దూరు మండల టీఆర్‌ఎస్ వైస్ ఎంపీపీ మలిపెద్ది మల్లేశం సీసీ రోడ్డును నిర్మించారు. శనివారం ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని, హిందూ సాంప్రదాయాలను ముందు తరాలకు అందించాలని తెలిపారు.

నూతన కమిటీ

పాలకుర్తి టౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు రమేష్ ప్రకటించారు. మండల గౌరవ అధ్యక్షుడిగా పోగు శ్రీనివాస్ (మాజీ సర్పంచ్), అధ్యక్షుడిగా చిట్యాల వేణు, ఉపాధ్యక్షుడిగా పోగు శ్రీనివాస్, కార్యదర్శిగా బిర్రు సోమేశ్వర్, సహాయ కార్యదర్శిగా ఎండీ యాకుబ్ పాషా, కోశాధికారిగా కోట రాంమ్మూర్తి, గౌరవ సలహాదారులుగా చి ట్యాల సోమనారాయణ, పూస్కూరి రాజేశ్వర్‌రావు, దాసరి విజయ్‌కుమార్, పోగు చిరంజీవి, వే ముల శ్రీనివాస్, చిదురాల ఆంజనేయులు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

చిల్పూరు: రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దును నిరసిస్తూ ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం నేపథ్యంలో శనివారం మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పాలకుర్తి టౌన్: దర్దేపల్లికి చెందిన గీత కార్మికుడు గిరగాని యాదగిరి ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపైనుంచి పడి మృతి చెందాడు. కాగా, శనివారం బాధిత కుటుంబానికి కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన కోరంగి ఫౌండేషన్ మృతుడి భార్య విజయకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యాన..

పాలకుర్తి: మండల కేంద్రంలో చిలుకమారి మనోహర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, బాధిత కుంటుంబానికి పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

బియ్యం అందజేత

లింగాలఘణపురం: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నక్కల భిక్షపతి కుటుంబానికి టీడీపీ నాయకులు క్వింటాల్ బియ్యం, రూ.2వేల ఆర్థికసాయం అందజేశారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



రఘునాథపల్లి: మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం అజయ్ కోరారు. శనివారం లింగాలఘణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ఎమ్మెల్సీని కలిసి విన్నవించారు. మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమ వినతికి ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారని అజయ్ తెలిపారు.

విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 27 నుంచి 29 వరకు జిల్లాలో ఈ యాత్ర కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. సుధాకర్, సమ్మయ్య, యాకయ్య ఉన్నారు.

బచ్చన్నపేట: సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడబోయిన రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు చైతన్య యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

వనదర్శిని

లింగాలఘణపురం: నవాబుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు వనదర్శిని కార్యక్రమంలో భాగంగా మచ్చుపహడ్ రిజర్వ్‌ఫారెస్ట్‌ను సందర్శించారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సయ్యద్ ఇజాజ్ అహ్మద్ విద్యార్థులకు అడవుల ఆవశ్యకత, మొక్కల పెంపకంపై వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. సెక్షన్ ఆఫీసర్ రమేష్, శోభ, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ సందర్శన

బచ్చన్నపేట: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 5ఈ ఛాంపియన్స్ ప్రొఫైల్ ఇనిషియేటివ్‌లో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఆసక్తి కరమైన ప్రదేశాలను చూపిస్తున్నామని తెలిపారు. రైల్వే వ్యవస్థపై అవగాహన కల్పించారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న భాస్కర్

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా ఆరెళ్ల భాస్కర్ నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాటి నుంచి నేటి వరకు సామాజిక కార్యక్రమాలను చేపట్టిందని, దేశ అభివృద్ధికి కూడా పాటుపడిందన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భూమయ్య, యూత్ అధ్యక్షులు సాయిబాబ, దామెర సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

దేవరుప్పుల: సిరిధాన్యాలతో కౌమార దశ బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, అన్వర్‌నిషా అన్నారు. పోషణ పక్వాడా పక్షోత్సవాలను పురస్కరించుకొని శనివారం మండల పరిధి చిన్నమడూరు, మాధాపురం, ధర్మాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. అనంతరం సిరిధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. చిన్నమడూరులో శ్రీదేవి మాట్లాడుతూ పరిసరాల్లో లభ్యమయ్యే ఆకుకూరలు, కూరగాయలు, పాలతోపాటు సిరిధాన్యాలను తీసుకోవడం వల్ల బీ6, బీ12, బీ17 విటమిన్లు, ఫైబర్, మాంసం కృత్తులు, ఐరన్ లభిస్తాయని చెప్పారు. సర్పంచ్‌లు వంగ పద్మ, గుర్రం స్రవంతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు గొడుగు సుజాత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

చిరు ధాన్యాలు వాడాలి..

బచ్చన్నపేట: సంపూర్ణ ఆరోగ్యానికి అందరూ చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మండల కేంద్రంలోని వాణి స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కరుని సుమలత అన్నారు. పాఠశాలలో అంగన్‌వాడీలు పిల్లలకు ఆహార పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం

రఘునాథపల్లి: పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని అంగన్‌వాడీ టీచర్లు యాదలక్ష్మి, రజిత, లావణ్య అన్నారు. శనివారం మండలంలోని వెల్దిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయాలు పుష్ప, ఎల్లమ్మ, ఉప్పలమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

జఫర్‌గఢ్: పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.అనిత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నేతృత్వంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక పదార్థాలతో ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు జగదీశ్వరి, సోమలక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు

జనగామ: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోపాలస్వామికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శనివారం నివాళులర్పించారు. మృతదేహంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. గోపాలస్వామి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రావు, ఆకుల శ్రీనివాస రావు, లింగాలఘనపురం ఎంఈఓ చంద్రారెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, ఖదీర్, బుర్ర రమేష్, కృష్ణ, విజయ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ చోరీ.. గంట వ్యవధిలో అప్పగింత

- పోలీసుల సత్వర సేవలకు హర్షం



వర్ధన్నపేట: ఓ వ్యక్తి పార్క్ చేసిన బైక్ చోరీకి గురయ్యింది. పోలీసులను ఆశ్రయించగా.. గంట వ్యవధిలో బైక్‌ను దొరకబట్టారు. పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన బండి అనిల్ శనివారం తన భార్యతో కలిసి బైక్‌పై వర్ధన్నపేట మండల కేంద్రానికి వచ్చాడు. స్థానికంగా ఓహోటల్ వద్ద బైక్ పార్క్ చేసి పనులు పూర్తి చేసుకున్నాడు. తిరిగి బైక్ వద్దకు రాగా.. కనిపించలేదు. దీంతో వెంటనే అతను డయల్ 100కు కాల్ చేసి తన పరిస్థితిని వివరించాడు. సత్వరమే స్పందించిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించి విచారణ చేపట్టారు. పోలీసులు గంట వ్యవధిలో బైక్‌ను గుర్తించి బాధిత కుటుంబీకులకు అందజేశారు. వేగంగా స్పందించి తన బైక్‌ను అప్పగించినందుకు బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

స్టేషన్‌ఘన్‌పూర్: కుటుంబ కలహాలతో మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన రాగుల రమేష్(38) అనే వ్యక్తి పురుగుల మంది తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తానేదార్‌పల్లికి చెందిన రమేష్‌కు 2004లో స్వప్నతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. రాజు వ్యవసాయ కూలీగా, హమాలీ కార్మికుడిగా, మత్స్య కార్మికుడిగా పనిచేసేవాడు. అయితే రమేష్ కుటుంబాన్ని పట్టించుకోకుండా కూలీ పనికి వెళ్లకుండా తరచూ మద్యం సేవిస్తుండగా భార్యభర్తలకు గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఈనెల 24న రాత్రి మద్యం సేవించి వచ్చిన రమేష్‌తో భార్య గొడవ పెట్టుకుంది. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన అతడు ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి అన్న రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

జయశంకర్‌నగర్‌లో చోరీ

జనగామ: జనగామ పట్టణంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రేయిన్ మార్కెట్ ఏరియాలోని జయశంకర్‌నగర్ కాలనీకి చెందిన పుట్ట వెంకటేష్ , సంధ్య దంపతులు పని నిమిత్తం ఊరికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమణించిన గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ.1.30లక్షల నగదుతో పాటు నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని స్థానికుల సమాచారం మేరకు వెంకటేశ్ వచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో విచారణ జరిపించి, దొంగలు ఎవరనే దానిపై కూపీ లాగుతున్నారు.

గ్యాస్ లీకేజీతో వస్తువులు దగ్ధం

జఫర్‌గఢ్: గ్యాస్‌సిలిండర్ లీకేజీతో ఇంట్లో ఉన్న వస్తువులు దగ్ధమైన సంఘటన మండలంలోని సూరారంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన బాలబోయిన కుమార్ ఇంట్లో లేనిసమయంలో గ్యాస్ లీకేజీ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇంట్లోని దుస్తులు, వంట సామగ్రితో పాటు బీరువా తదితర వస్తువులు కాలిపోయాయి. దీంతో ఆస్తినష్టం జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి: ప్రమాదవశాత్తు తాటి చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని గూడూరులో శనివారం జరిగింది. గీత కార్మికుడు పొన్నం సోమయ్య(46) తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.